## క్లుప్తంగా

### తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ యార్డును బుధవారం సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, డీసీఓ నాగేశ్వర్ రావు సందర్శించారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ధాన్యంతో రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. కొనుగోళ్లు పూర్తయిన వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామన్నారు.

### ప్రభుత్వంపై విమర్శలు సరికాదు

చిన్నకోడూరు(సిద్దిపేట): అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పల్లె రాజు, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు హెచ్చరించారు. బుధవారం చిన్నకోడూరులో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు స్వార్థం కోసం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

### నేడు విద్యుత్‌కు అంతరాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగాపూర్ ఫీడర్ లైన్ కింద చెట్ల కొమ్మలు తొలగించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు రాంపూర్, చందాపూర్, వెంకట్రావుపేట, లింగాపూర్, బంజేరుపల్లి గ్రామాలకు గృహ, వ్యవసాయ మోటర్లకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

### నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ నూతన పాలకవర్గ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రముఖ శైవ ఆలయం ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ఆలయ ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ పాలకవర్గ సభ్యులుగా పొన్నమల్ల యాదగిరి, దొండిగల్ల శ్రీనివాస్, ఎల్లయ్య, సందుల మాధవి, తాడేపు భూమేష్, అనూష ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, అత్తు ఇమామ్, మహేందర్‌రావు, లక్ష్మి, యాదగిరి, సతీష్ గౌడ్, రజిని, సన, సలీం, సాయి, ప్రతాప్, వంశీ పాల్గొన్నారు.

### ప్రజలు సుభిక్షంగా ఉండాలి



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పెద్దమ్మ తల్లి దీవెనలతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంపేటలో నిర్వహించిన పెద్దమ్మ,పెద్దిరాజుల కల్యాణ ఉత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయానికి విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ముదిరాజ్ సంఘం నాయకులు తెలుపగా.. అధికారితో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, బీఆర్ఎస్ నేత సుజాత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, కర్ణాకర్, కనకయ్య, రమేష్, అశోక్, మల్లేశం, స్వామిగౌడ్, నరేందర్ పాల్గొన్నారు.

### మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పది రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.10వేల జరిమానా విధించారు.

# సొంత భవనాలు కలేనా?

**మహిళా సంఘాల సమావేశాలకు తిప్పలు**

- ఇబ్బందులు పడుతున్న సభ్యులు
- ఫలితంగా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

మద్దూరు(హుస్నాబాద్): మహిళా స్వయం సహాయక సంఘాలకు శాశ్వత భవనాలు లేక కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సంఘాల నిర్వహణ కొనసాగుతోంది. సంఘాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు సంఘం సభ్యుల ఇళ్లలో, ఆరుబయట, అద్దె ఇళ్లలో సమావేశాలు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సొంత భవనాలు నిర్మించాలని మహిళలు కోరుతున్నారు.

**అద్దె భవనాల్లో సమావేశాలు**

ఉమ్మడి మద్దూరు మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల పరిధిలో 35 గ్రామైక్య సంఘాలుండగా, వాటిలో 919 స్వశక్తి సంఘాలున్నాయి. వీటిలో దాదాపు 9559 మంది సభ్యులున్నారు. 35 గ్రామైక్య సంఘాలకు గాను ఆరింటికీ మాత్రమే సొంత భవనాలు ఉండగా, 12 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా సంఘాల సభ్యులు అద్దె భవనాల్లో, సంఘాల అధ్యక్షురాలు ఇంట్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామ స్థాయిలో భవనాలు లేక మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే రాత్రి వేళల్లో సమావేశాలు నిర్వహించుకోవాలంటే భయపడుతున్నారు. వీటికి తోడు ప్రైవేట్ భవనాలకు చెల్లిస్తున్న అద్దె సైతం భారమవుతున్నదని సభ్యులు పేర్కొన్నారు. ప్రధానంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లు, సభ్యుల్లో చైతన్యం నింపే గ్రామ సంఘాలకు సరైన వేదికలు అందుబాటులో లేవు. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామాల్లో సంఘాలకు సొంత భవనాలను మంజూరు చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.



ఓ ఇంట్లో సమావేశం నిర్వహించుకుంటున్న మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

**భవనాలు నిర్మించాలి**



గ్రామైక్య సంఘానికి భవనాలు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నాం. సంఘం సభ్యులకు శిక్షణనిచ్చే సమయంలో మహిళా ప్రతినిధులు వచ్చినప్పుడు సమావేశాలు నిర్వహించుకునేందుకు కార్యాలయం లేదు. ప్రభుత్వం స్పందించి భవనాలను ఏర్పాటు చేయాలి.

– ఎస్తేరా (గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు)లద్నూరు

**నిధులిస్తే భవనాలు నిర్మిస్తాం**



మండలంలో 35 గ్రామైక్య సంఘాలు ఉండగా వాటిలో 17 సంఘాలకు సొంత భవనాలు లేవు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు చేస్తే సొంత భవనాలు నిర్మిస్తాం.

– బాబురావు ఏపీఎం(మద్దూరు)

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్

మద్దూరు(హుస్నాబాద్): ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చొప్రి రవికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ ప్రయోజనాల కోసం గతంలో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, వాటికి బదులుగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని విమర్శించారు. కార్మిక ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తూ తలపెట్టిన సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరి, మండల కార్యదర్శి ఎండి షఫీ, నరేశ్ పాల్గొన్నారు.

**చేర్యాల మండలంలో..**

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 20న చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద ప్రజా సంఘాలతో కలిసి సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అరుణ్, నాగరాజు, శ్రీహరి, నర్సిరెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, శోభ, ఎజాస్, భాస్కర్, కనకయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకట్‌మావో, నాయకులు

### పొట్లపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి భక్తుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని బుధవారం గ్రామస్తులు కోరారు. హుస్నాబాద్ వయా పొట్లపల్లి మీదుగా సిద్దిపేట బస్సులను నడిపించాలన్నారు. మహాశివరాత్రి జాతర రోజు అధికారులు బస్సు సర్వీసులు నడిపిస్తున్నారని, తర్వాత గ్రామానికి నడపడం లేదన్నారు. గ్రామస్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలంటే 5 కిలోమీటర్ల దూరం పందిల్ల స్టేజీ వరకు ప్రైవేటు వాహనంలో వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

### ప్రజల దాహార్తి కోసం చలివేంద్రం

గజ్వేల్ : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరాపార్క్ చౌరస్తాలో గజ్వేల్ ప్రభుత్వ పాఠశాల 1984 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్థానిక ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తోట భిక్షపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

దౌల్తాబాద్ (దుబ్బాక) : విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం సుధాకర్ (34) ఊర్లో ఉంటూ వ్యవసాయం, ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మోత్కు ఎల్లం వ్యవసాయ భూమిలో మోటర్ వైర్లను రిపేరు చేయడానికి విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో వెంటనే అతన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4.30 గంటలకు మరణించారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల పాఠశాల 1999–2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలు, మధురస్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు వెంకటనారాయణ, హరినాథ శర్మ, రాధాకృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పెంటయ్య, రమేశ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలకిషన్, విఠోభ, నరసింహ, రజనీకాంత్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, మధు, బాబు, బాల్‌లక్ష్మి, స్వప్న, జ్యోతి, రేఖ, రోహిణి, సుమప్రియ, శోభ, బాల్‌నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ బాధిత కుటుంబాలకు సాయం**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన ఉపాధిహామీ మహిళా కూలీలు చంద్రవ్వ, దేవవ్వ ఇటీవల కారు ఢీకొట్టడంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గాడిపల్లి ఫౌండేషన్ చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బాధిత కుటుంబాలను డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పరామర్శించారు. ఉపాధి హామీ కూలీలకు రైతు బీమా వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**◆ చెక్కుల పంపిణీ**

తొగుట(దుబ్బాక): మండల పరిధిలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్ రెడ్డి, భూపాల్, నిరంజన్, మహిపాల్‌రెడ్డి, విజయ్ పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**కొండపాక మండలంలో...**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలో దుద్దెడకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బుధవారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు భాను, పల్లె బాబు, నవీన్, రాకేశ్, రాజు పాల్గొన్నారు.

**◆ 68 మంది లబ్ధిదారులకు..**



దుబ్బాకటౌన్: దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 68 మంది లబ్ధిదారులకు రూ. 24.7 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బుధవారం దుబ్బాక కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, నరేందర్ రెడ్డి , శ్రీనివాస్, సాయి, నరేందర్, భరత్, తదితరులున్నారు.

**◆ ఎల్ఓసీ అందజేత**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి గ్రామానికి చెందిన దేవనబోయిన సుదర్శన్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల 25 వేల విలువైన ఎల్ఓసీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శన్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా బాధితుడి వైద్యం కోసం ఎల్ఓసీ మంజూరు చేయించారని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్యం, నాయకుడు ఉదయ్ ఉన్నారు.

**◆ అంత్యక్రియలకు సాయం**

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రఘుపతి అనే వ్యక్తి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతుడి అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి తెలిపారు.

**◆ బాధ్యతల స్వీకరణ**

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఏఈలను నియమించింది. బుధవారం హుస్నాబాద్ ఏఈగా భవానీ బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇళ్ల బిల్లుల చెల్లింపులు ఆలస్యం కాకుండా ప్రత్యేక ఏఈలను నియమించినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ హౌస్‌ను ఏఈ కార్యాలయానికి కేటాయించినట్లు పేర్కొన్నారు.

**◆ పుస్తెమట్టెలు అందజేత**

బెజ్జంకి(సిద్దిపేట): డెయిరీ సభ్యుడు గుబిరె సతీశ్, జ్యోతిల కుమార్తె యామిని వివాహానికి బుధవారం కరీంనగర్ డెయిరీ చైర్మన్ సుధాకర్ రెడ్డి హాజరై పుస్తెమట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీసీ చైర్మన్, ముత్యంరెడ్డి, బెజ్జంకి చైర్మన్ ఎలిగె సతీష్, సూపర్‌వైజర్ దనుర్భాన్ పాల్గొన్నారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడి

**తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన**

నంగునూరు(సిద్దిపేట): ఎరువులు ఇష్టారీతిగా వాడకుండా నేల సారాన్ని బట్టి వాడుతూ పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు శ్వేత, సరిత రైతులకు సూచించారు. తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వెంకటాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. రాబోయే వర్షాకాలం పంటల సాగులో మెలకువలు, నేల యాజమాన్యం, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ లేబుల్ సీల్ ఉన్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి బిల్లును దాచుకోవాలన్నారు. మట్టి పరీక్షలతోపాటు పచ్చిరొట్ట ఎరువులు వాడి నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఏడీఏ పద్మ, ఏఓ గీత, ఆయిల్‌ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

## అపరిచితులను నమ్మి మోసపోవద్దు

గజ్వేల్‌రూరల్: అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు సైబర్ నేరాలు, మహిళలు, ప్రజల రక్షణకు ఉన్న చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాట్సాప్‌కు వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలను ఎవరికి చెప్పవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు లేదా 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సైదా

## సైబర్ నేరాలపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సమత, షీటీం సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గులో హుస్నాబాద్ షీటీం ఆధ్వర్యంలో మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తలు, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ఉపాధి కూలీలకు నిర్వహించిన సమావేశంలో ప్రొబెషనరీ ఎస్ఐ సమత మాట్లాడుతూ ఎక్కడైనా ఎవరైనా మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీం నంబర్ 87126 67434కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీం సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత

శివ్వంపేట(నర్సాపూర్): బాల్య వివాహాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాలల సంరక్షణ విభాగం అధికారులు సరిత, శంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, అక్రమ దత్తత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, యువతుల పై జరిగే దాడులపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన అనంతరం ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని మైనర్ పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే చట్టరీత్యా వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఆడపిల్లలపై దాడులు, బలవంతపు పెళ్లిళ్లు, ఇతర సమస్యలపై హెల్ప్‌లైన్ నంబరు 1098 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ తదితరులు ఉన్నారు.



పిల్లుట్లలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

## శంకుస్థాపన చేశారు..
# పనులు మరిచారు



కంకర తేలిన మల్లేషంపల్లి- శౌరిపూర్ రోడ్డు

- మల్లేశంపల్లి, శౌరిపూర్ రోడ్డు అధ్వానం
- కంకర తేలి ప్రయాణం నరకం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దౌల్తాబాద్ (దుబ్బాక ) : మండల పరిధిలోని మల్లేషంపల్లి నుంచి శౌరిపూర్ వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా తయారైంది. దీంతో గ్రామాల ప్రజలు ప్రయాణం చేయాలంటేనే భయపడుతున్నారు. గత ప్రభుత్వం మల్లేషంపల్లి, శౌరిపూర్ గ్రామాలను ఒకే గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. అలాగే రెండు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామ పంచాయతీ భవనానికి, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు కోసం సుమారు రూ.2 కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. 2022లో రూ.93.80 లక్షలతో ముబారస్‌పూర్ నుంచి మల్లేషంపల్లి మీదుగా శౌరిపూర్ వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించకపోవడంతో స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

**అభివృద్ధి చేయాలి**



నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటవడంతో రెండు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశించాం. గత ప్రభుత్వంలో శంఖు స్థాపన చేసి రోడ్డు నిర్మించ లేదు. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలి.

– దార సత్య నారాయణ, మాజీ సర్పంచ్

**కంకర రోడ్డుతో అవస్థలు**



శౌరిపూర్ నుంచి మల్లేషంపల్లి వరకు రోడ్డు సరిగా లేక అనేక అవస్థలు పడుతున్నాం. గత ప్రభుత్వంలో మూడేళ్ల క్రితం రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేశారు. రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– చెన్న భీమా రాజు,శౌరిపూర్